క్లుప్తంగా

ముగిసిన భాగవత సప్తాహం


ప్రవచాలు చెబుతున్న చంద్రశేఖరరెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణం లోని గీతా మందిరంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా రిటైర్డు అధ్యాపకులు చంద్రశేఖరరెడ్డి మహారాజు చరిత్రపై ప్రవచనం చేశారు. అలాగే భాగవతం నుంచి ఏడు ప్రధాన ఘట్టాలతో కూడిన ప్రవచనాలను వివరించారు. కార్యక్రమంలో ధర్మప్రచార సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ శానిటరీ సెక్రటరీలు

పులివెందుల టౌన్ : స్థానిక మెయిన్ రోడ్డులో గల తోపుడు బండ్ల నుంచి సోమవారం వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు అన్ని సచివాలయాల పరిధిలలో ప్రజలకు తడి, పొడి, హానికర చెత్తలను వేరు చేసి.. పురపాలక సంఘం చెత్త సేకరణ వాహనాలకు అందించే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం


ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణం లోని శ్రీరంగనాథస్వామి ఆలయ ప్రాంగణం లో సోమవారం శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు ఆలయ ప్రాంగణంలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి రోడ్లను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కేవీ రమణ విద్యార్థులకు శ్రీరంగనాథ స్వామి చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీజేయూ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ అల్లం రంగనాయకులు, ప్రిన్సిపాల్ వై.నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది విజయ్, హిందూ ప్రతినిధి జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం


అరవింద్

వేంపల్లె : వేంపల్లి పట్టణానికి చెందిన పుల్లగూర అరవింద్‌కు సేవా రత్న అవార్డు లభించింది. సోమవారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో మదర్ ఫౌండేషన్ నిర్వహించిన సేవా రత్న అవార్డ్స్– 2025లో భాగంగా అవార్డును అందుకున్నారు. భారతరత్న మదర్ థెరిస్సా 115వ జయంతి సందర్భంగా ఆ సంస్థ ఫౌండర్ అంకెనపల్లి మల్లికార్జునరావు చేతుల మీదుగా ఈ సేవా రత్న అవార్డు అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు సేవలు అందించిన వారికి ఈ ఫౌండేషన్ తరఫున సేవా రత్న అవార్డులు అందించారు. ఈయన ఇప్పటికీ 61వ సారి రక్తదానం చేశారు. వేంపల్లె పట్టణంలో రక్తదాన శిబిరాలతోపాటు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను తన సేవలను గుర్తించి అవార్డును ప్రదానం చేయడం జరిగిందని అరవింద్ తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పులివెందుల టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలతోపాటు పలు అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఇన్‌చార్జి పాలకవర్గం సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఇల్లూరు శివ శంకరరెడ్డి చైర్మన్‌గా, సభ్యులుగా చప్పిడి వెంకటరమణ, గంగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు.

తొలగించెన్.. ఏడి 'పింఛన్'

కూటమి అధికారంలోకి వచ్చాక పింఛన్లు తొలగించడంతో దివ్యాంగులు ఆవేదన చెందుతున్నారు. సోమవారం వికలాంగుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పులివెందుల పట్టణం అంబకపల్లె రోడ్డులోని మినీ సెక్రటేరియట్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. పింఛన్లపైనే కుటుంబం ఆధారపడి ఉందని వారు పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం వారు ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు.

– పులివెందుల టౌన్


ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న దివ్యాంగుల సంఘాల ఐక్య వేదిక నాయకులు

నడవలేను.. మాటలు రావు



2010 నుంచి పింఛన్ వస్తోంది. నేను నడవలేను. మాటలు సరిగా రావని, తన మూగ సైగలతో తెలిపాడు. పుట్టుకతోనే వైకల్యం ఉంది. ఇతనికి 94శాతం వికలత్వం ఉన్నట్లు పర్మినెంట్ సర్టిఫికెట్ మంజూరైంది. వైద్యులు ఏమి చూడకుండానే 40 శాతం కంటే తక్కువగా ఉందని నోటీసులు ఇవ్వడం దారుణమని ఆయన తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు.

– పలగాని చంద్ర, దివ్యాంగుడు

నా కొడుకు చెవుడు, మూగతో ఇబ్బంది పడుతున్నాడు



నాకు పుట్టుకతోనే చెవుడు, మూగ ఉంది. నాకు ముగ్గురు కుమారులు. అందులో చివరి కుమారుడు సొహేల్ చెవుడు, మూగతో ఇబ్బందులు పడుతున్నాడు. నాకు వచ్చే పింఛన్ ఒకటే ఆధారం. నాకు భర్త కూడా లేడు. నేను మా అమ్మ వారింట్లో ఉంటున్నాను. తనకు పింఛన్ తొలగిస్తే ఎలా బతకాలని కన్నీటి పర్యంతమైంది.

– సయ్యద్ అన్సార్ జాహ, దివ్యాంగురాలు

నడలేని స్థితిలో ఉన్నాను



నేను నడవలేని స్థితిలో ఉన్నాను. కానీ నాకు వచ్చే పింఛన్‌ను తొలగించారు. మా అమ్మ పని చేస్తూ జీవనం సాగిస్తోంది. నాకు వచ్చే పింఛన్ ఎంతో ఆదెరువుగా ఉండేది. ఆ పింఛన్ రాకుండా పోతే మేం రోడ్డున పడాల్సి వస్తుంది.

– హవీలా, దివ్యాంగురాలు

పింఛన్ లేకపోతే బతకలేను



నాకు పింఛన్ ఒక్కటే ఆధారం. నేను ఎలాంటి పని చేసుకోలేను. ఈ పింఛన్‌తోనే నా బతుకు దెరువు సాగుతోంది. ఉన్నఫలంగా పింఛన్‌ను తొలగిస్తే నేను బతకలేను. నా కుటుంబానికి భారమవుతోందని రోదించింది. ప్రభుత్వం వెంటనే స్పందించి నాకు పింఛన్‌ను పునరుద్ధరించాలి.

– అశ్విని, దివ్యాంగురాలు

వెన్ను సమస్యతో నడవలేకున్నా..



నాకు వెన్ను సమస్య చాలా ఏళ్లుగా ఉండటంతో నడవలేకపోతున్నా. దీంతో నాకు వైద్యులు వికలత్వం సర్టిఫికెట్ మంజూరు చేశారు. అప్పటి నుంచి ప్రతినెలా పింఛన్ వస్తోంది. ఈ పింఛన్‌తో నా జీవనం గడిచేది. పింఛన్ తొలగిస్తే ఎలా బతకాలి. వైద్యులకు నా బాధ అర్థం కావడం లేదు.

– సిద్దమ్మ, దివ్యాంగురాలు

చట్టాలపై అవగాహన అవసరం


శక్తి యాప్‌పై వివరిస్తున్న పోలీస్ అధికారులు

జమ్మలమడుగు రూరల్ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని పతంగే రామన్నరావు ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల నేటి యువత చెడు నడకకు అలవాటు పడుతున్నారని తెలిపారు. కష్ట సమయం వచ్చినప్పుడు విద్యార్థినులు తమను తాము రక్షించుకునేందుకు శక్తి యాప్ ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేష్ బాబు, ఏఎస్ఐ గంగన్న, కానిస్టేబుళ్లు సురేంద్ర, కరీముల్లా, ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్గా స్థలం ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు


దర్గా స్థలం వద్ద నిర్మిస్తున్న గోడలు


తహసీల్దార్‌కు విన్నవిస్తున్న గ్రామస్తులు

మైలవరం : మండల పరిధిలోని పెద్దకొమెర్ల గ్రామంలో దర్గా స్థలాన్ని ఆక్రమిస్తున్నారని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సోమవారం పెద్దకొమెర్ల గ్రామానికి చెందిన ఎస్సీలు తహసీల్దార్‌తో మాట్లాడుతూ పూర్వం నుంచి దర్గా ఉందని, తమ గ్రామస్తులందరూ ఈ దర్గానే దర్శించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఏ కార్యక్రమాన్ని అయినా ఈ దర్గా వద్ద పూజలు చేసి ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ దర్గా వద్ద ఉన్న ఖాళీ జాగాను జెండా పండుగ చేయడానికి, ఏవైనా మొక్కులు తీర్చుకోవడానికి, అన్నదాన కార్యక్రమాలు చేపట్టడానికి ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వాస్తవంగా దర్గా చుట్టూ స్థలాన్ని బాగు చేస్తామని మొరుసు తోలి, ఇప్పుడు మాత్రం తమ అసరాల కోసం ఉపయోగించుకోవటానికి కాంపౌండ్ నిర్మించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దర్గాకు వెళ్లడానికి కూడా 8 అడుగుల రస్తా వదిలారని, ప్రజలు వస్తే కార్యక్రమాలకు ఇబ్బంది అవుతుందని, ఈ స్థలాన్ని దర్గాకు కేటాయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆర్ఐ అజేయ్‌ను పిలిచి ఎవరైనా ఆక్రమించుకుంటున్నారో విచారణ చేసి, వారికి సంబంధించిన పత్రాలు ఏమైనా ఉంటే తమ ముందు ఉంచాలని, అప్పటి వరకు పనులు నిలిపి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

యానిమేటర్ తీరుపై డ్వాక్రా సభ్యుల నిరసన


నగర పంచాయితీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాబా గ్రూప్ సభ్యులు

కమలాపురం : తమ పట్ల యానిమేటర్ అనుచితంగా ప్రవర్తిస్తోందని, ఏ పని చేయాలన్నా డబ్బులు అడుగుతోందని డ్వాక్రా సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 3వ వీఓ బాబా గ్రూప్‌నకు చెందిన సభ్యులు మాబుచాన్, రజియా, జమీరా, సంజమ్మ, రేష్మా, అమీషా, వెంకట లక్షుమ్మ తదితరులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఇటీవల జరిగిన గ్రూపుల ఆడిట్‌కు ఒక్కో గ్రూప్ నుంచి రూ.1000 ఇవ్వాలని యానిమేటర్ బలవంతంగా వసూలు చేసిందని వారు ఆరోపించారు. తమ గ్రూప్ సభ్యులు పొదుపు డబ్బులు డ్రా చేయడానికి తీర్మానం చేయాలని అడిగినప్పటికీ.. యానిమేటర్ హైమావతి స్పందించలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మెప్మా అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయం పై మెప్మా అధికారిణి లావణ్యను వివరణ కోరగా ఇంత వరకు తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఈ రోజే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఫిర్యాదును సుమోటోగా స్వీకరించిన కమిషనర్ ప్రహ్లాద్ విచారణకు ఆదేశించారని, విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : స్థానిక భాకరాపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అమెరికాలో ఉంటున్న పులివెందుల వాసి తిరుమలరెడ్డి, శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అందిస్తున్న చికిత్సల గురించి తెలుసుకున్నారు. స్వయంగా ఆయన కంటి పరీక్షలు చేయించుకుని వారు కల్పిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో కూడా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి వైఎస్ మనోహర్‌రెడ్డి ఎన్నో సౌకర్యాలు ఏర్పాటు చేశారని, ఈ కార్యక్రమం దిగ్విజయం కావడానికి ఎంతో కృషి చేశారని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, పట్టణ ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్, కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగాపురం మధు, కొంగనపల్లి రవి, పద్మనాభరెడ్డి, ఆర్యవైశ్య నాయకులు సాయిబాబు, బాబు, శంకర్ నేత్రాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ.. అందరి బాధ్యత

వీరపునాయునిపల్లె : బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాల, యస్.పాలగిరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాలికల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం సభ్యులు విజయకుమారి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి


జ్యోతి వెలిగించి రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న రఫిక్, సూర్యం

జమ్మలమడుగు : యువత మంచి నడవడికతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఎస్ఐ హైమావతి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రఫిక్‌పాషా పేర్కొన్నారు. సోమవారం రాజయోగిని బ్రహ్మకుమారీ ప్రకాశమణి 18వ సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ఓంశాంతి ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస డిగ్రీ కాలేజీలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 50 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, దిలీప్, ఓంశాంతి ఉమ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత నీరు అందించండి


కూల్ వాటర్ ప్లాంటు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పులివెందుల మండలం నల్లపురెడ్డి పల్లె గ్రామంలో ఆర్ఓ వాటర్ ప్లాంటును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆసిఫ్ అలీ సుమారు రూ.3 లక్షలతో గ్రామ ప్రజలకు చల్లని నీరు అందించే విధంగా వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారన్నారు. నల్లపురెడ్డిపల్లె, ఎర్రబల్లె, కొత్తపల్లె పంచాయతీల పరిధిలోని ప్రజలకు చల్లని నీరు అందించేందుకు ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణిత శాస్త్రంలో పీహెచ్‌డీ


మాధవి

కడప ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని ఎస్.మాధవికి గణిత శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎక్సామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఆచార్య సునీత బాయ్ గారి మార్గదర్శకత్వంలో 'స్ట్రెస్ అండ్ మాథెమాటిక్స్ ఆంక్సిఏటీ ఆన్ ది అచివ్మెంట్ ఇన్ మాథెమాటిక్స్ ఆఫ్ సీనియర్ సెకండరీ స్టూడెంట్స్' అంశంపై మాధవి పరిశోధనా గ్రంథం సమర్పించారు. ఇందుకుగానూ ఎస్.మాధవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి


కమలాపురం : సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎస్కే రోషన్

కమలాపురం : వినాయక చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరని కమలాపురం సీఐ ఎస్కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్, ట్రైనీ ఎస్ఐ సూర్యనారాయణరెడ్డి అన్నారు. కమలాపురంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండపాల సమీపంలో అశ్లీల నృత్యాలు చేయరాదని, చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి 10 గంటలు దాటిన తరువాత ఎలాంటి డీజేలు, మైకులు పెద్ద సౌండ్‌లతో పెట్టరాదని సూచించారు. పండుగను కులమతాలకతీతంగా జరుపుకోవాలని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

పెండ్లిమర్రి : వినాయక చవితి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రూరల్ సీఐ చల్లని దొర పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

సింహాద్రిపురం : వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ రవికుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ విగ్రహాలు ఎన్ని రోజులు ఏర్పాటు చేస్తారు, నిమజ్జనం ఏ స్థలంలో నిర్వహిస్తారో తదితర వివరాలు తెలపాలన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం ఇవ్వండి

సింహాద్రిపురం : అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే ప్రజలు పోలీసులకు గానీ, విద్యుత్ అధికారులకు కానీ సమాచారమివ్వాలని విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ దినేష్ కుమార్ తెలిపారు. రాత్రి సమయంలో కొన్ని ప్రాంతాల్లో డీటీఆర్, అక్కడక్కడా సింగల్ ఫేస్, త్రీ ఫేస్ ట్రాన్స్‌పార్మర్లను పగలగొట్టి కాపరు వైరు దొంగతనాలు జరుగుతున్నాయని, దీంతో రైతులు, విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులకు గురవతున్నారన్నారు. ప్రజల సహకారం ద్వారానే ఇటువంటి దొంగతనాలను నివారించవచ్చునని, కాబట్టి ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కదలికలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు, విద్యుత్ అధికారులకు తెలియజేస్తే దొంగతనాలు జరగకుండా నివారించవచ్చునన్నారు.

30న సంచార జాతుల విముక్తి దినోత్సవం


కరపత్రాలు విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : విజయవాడలో ఈ నెల 30న నిర్వహిస్తున్న సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. సోమవారం వేంపల్లె భాజపా నాయకులతో సమావేశం నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంచార జాతులు సదాచార వారసులు, సంస్కృతికి వారధులు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈశ్వరరెడ్డి, లక్ష్మిరెడ్డి, రామచంద్రారెడ్డి, సునీల్, సుమన్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష


టెక్నికల్ అసిస్టెంట్లతో చర్చిస్తున్న ఏపీఓ గంగరాజు

లింగాల : మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులపై సోమవారం ఉపాధి హామీ ఏపీఓ గంగరాజు టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత పది వారాలుగా కూలీలకు వేతనాలు అందడం లేదన్నారు. అందువల్ల కూలీలు పనులకు రాకపోవడంతో మండల వ్యాప్తంగా పనులు ఆగిపోయాయన్నారు. పనులను తిరిగి ఎలా పునరుద్ధరించాలి అనే విషయమై టెక్నికల్ అసిస్టెంట్లతో ఉపాధి హామీ ఏపీఓ గంగరాజు చర్చలు నిర్వహించారు. అదే విధంగా మూడు మాసాలుగా సిబ్బందికి వేతనాలు అందడం లేదన్నారు. ఉపాధి హామీ కూలీలు చాలా మంది డ్వాక్రా సంఘాల సభ్యులుగా ఉన్నారని, ప్రతి నెల డ్వాక్రా సంఘాల రుణాలు పొదుపులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీంతో వారు రైతు కూలీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. తిరిగే పనులు ప్రారంభించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న విషయంపై చర్చించారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు, విద్యార్థులు

తొండూరు : మత్తు వ్యసనం లేకుంటేనే సమాజంలో గౌరవం లభిస్తుందని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అరిఫుల్లా పేర్కొన్నారు. తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, గంజాయి, బ్రౌన్ షుగర్ లాంటి మత్తు పదార్థాల అలవాట్లతో అనారోగ్యం పాలై ఆర్థికంగా వెనుకబడి పిల్లల పోషణ భారమవుతుందన్నారు. హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని, గురువుల కృషిని మరవకుండా.. మంచి స్నేహితులను ఎంచుకుని భవిష్యత్ ప్రణాళికలతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని పేర్కొన్నారు. అనంతరం వారు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులచే మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేసే పోస్టర్‌లను విడుదల చేశారు. సేవా సమితి అధ్యక్షుడు రాజు, పాఠశాల సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అనధికారిక లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ ఆరీఫ్

జమ్మలమడుగు : గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ కోసం 134 జీవోను ఉపయోగించుకుంటే ఎంతో మేలని కడప పట్టణాభివృద్ధి సంస్థ ప్రణాళిక ఏపీఓ ఆరీఫ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులతో అనధికారిక లేఅవుట్‌లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 30వతేదీ లోపు అనధికారిక వెంచర్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగిన స్థల యజమానులు మాత్రమే అర్హులుగా ఉంటారన్నారు. లైసెన్సు కలిగిన ప్లానర్ ద్వారా లేదా వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శారదాంబ, ఎంపీడీఓ సయ్యదున్నిసా తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

జమ్మలమడుగు : ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి పదవ తరగతి ఉత్తీర్ణత, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నవరూప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, టీసీ, ఫొటోలు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో స్థానిక ఐటీఐ కాలేజీలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు. మోటార్ మెకానిక్, సివిల్, ఫిట్టర్ రెండు సంవత్సరాల కోర్సులు, డీజిల్ మెకానిక్, వెండర్ ఒక సంవత్సరం కోర్సులలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం పోలీస్, విజిలెన్స్ శాఖల అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎరువుల దుకాణాలలో సబ్సిడీ ద్వారా రైతులకు అందించే యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించిన అమ్మకాలు కొనుగోలు వివరాలు, యూరియాకు సంబంధించి స్టాక్ వివరాలు, రైతులకు అమ్మిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్ రెడ్డి, రూరల్ సీఐ రమణ, విజిలెన్స్ శాఖ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, ఏఓ చెన్నారెడ్డి, టెక్నికల్ ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేంపల్లె : యూరియాను అధిక ధరకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హరినాథరెడ్డి, సీఐ నరసింహులు ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు. సోమవారం వేంపల్లెలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను వారు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గొడన్లల్లో ఉన్న స్టాక్ ఎరువులను పరిశీలించడంతోపాటు విక్రయాలకు చెందిన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శివశంకర్‌రెడ్డి, పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు : రైతులకు సమస్యలు రాకుండా యూరియా పంపిణీ చేయాలని, యూరియా కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో ముద్దనూరు, కొండాపురం, సింహాద్రిపురం, తొండూరు మండలాలకు చెందిన ఎరువుల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ దస్తగిరి, మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి, సింహాద్రిపురం ఏవో కల్యాణ్‌కుమార్, తొండూరు ఏవో రాజు తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : ఎరువుల దుకాణాల యజమానులు నిబంధనలకు లోబడి విక్రయాలు చేపట్టాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోషన్, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, విజిలెన్స్ పీసీ సుధాకర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.